# సాక్షి
## మహబూబాబాద్

బుధవారం । 25 । సెప్టెంబర్ । 2024






**సీక్రెట్‌గా వీడియో తీశారు**

ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో తనను బెదిరించి వీడియోలో మాట్లాడించారని కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

- 8లో ▸



**పత్తికి ఆపతి..**

- 8లో ▸

ప్రస్తుతం పత్తి వంటను రసంపీల్చే పురుగులు ఆశించి తీవ్ర నష్టం కలుగజేస్తున్నాయని. రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మల్యాల కేవీకే శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

గరిష్టం/కనిష్టం
$36.8^0$ / $24.7^0$

**వాతావరణం**

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### ఎంఈఓల నియామకం

**మహబూబాబాద్ అర్బన్:** ప్రతి మండలానికి ఎఫ్ఏసీ ఎంఈఓను నియమిస్తూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఏ మండలంలో సీనియర్ పీజీ హెచ్ఎం ఉన్నారో అదే మండలానికి ఎఫ్ఏసీ ఎంఈఓగా నియమిస్తూ జాబితా విడుదల చేశారు. జిల్లాలోని 18మండలాలకు ఏంఈఓలను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. మానుకోట ఎఫ్ఏసీ ఎంఈఓగా ఎస్.వెంటేశ్వర్లు నియామకమయ్యారు. గంగారం పి.వెంకట్‌స్వామి, బయ్యారం దేవేంద్రాచారి, గూడూరు రవికుమార్, కేసముద్రం యాదగిరి, కురవి బాలాజీ, నర్సింహులపేట రామ్మోహన్‌రావు, దంతాలపల్లి శ్రీదేవి, డోర్నకల్ లక్ష్మా, గార్ల వీరభద్రారావు, ఇనుగుర్తి రూపారాణి, సీరోలు లచ్చిరాం, కొత్తగూడ లక్ష్మీనారాయణ, చిన్నగూడూరు రవికుమార్, నెల్లికుదురు రామదాసు, పెద్దవంగర శ్రీనివాస్, తొర్రూరు ఎం.బుచ్చయ్య, మరిపెడ ఎంఈఓగా అనితాదేవి నియమితులయ్యారు.

### మిరపనారు కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలి

**మహబూబాబాద్ రూరల్:** రైతులు మిరప నారు కొనుగోలు సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి మరియన్న, జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల మంగళవారం తెలిపారు. జిల్లా అధికారులు ధ్రువీకరించిన నర్సరీల నుంచి మాత్రమే మిరప నారు కొనుగోలు చేయాలని సూచించారు. పక్క రాష్ట్రాలు, జిల్లాలు, మండలాల నుంచి వచ్చే మిరప నారును ఎలాంటి ధ్రువీకరణ బిల్లులు లేకుండా రైతులు కొనుగోలు చేయవద్దని తెలిపారు. పేరుగాంచిన రకాలు, కంపెనీల నారు మొక్కలను వ్యవసాయ, ఉద్యాన శాఖల వారిచే ధ్రువీకరించిన నర్సరీల నుంచి మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. గుర్తు తెలియని, అడ్రస్ లేని వారి నుంచి మిరప నారు మొక్కలను కొనుగోలు చేసి రైతులు ఇబ్బందులను కొని తెచ్చుకోవద్దని సూచించారు. రైతులకు ఎలాంటి సందేహాలు ఉన్నా సంబంధిత అధికారులను సంప్రదించాలని వారు పేర్కొన్నారు.

### డీఈఓను కలిసిన ఉపాధ్యాయులు



**మహబూబాబాద్ అర్బన్:** జిల్లా కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో బీసీ ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం నాయకులు మంగళవారం డీఈఓ రాజేశ్వర్‌ను మార్యదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు దొంతోజు ఓంకార్ మాట్లాడుతూ.. జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గునిగంటి శ్రీనివాస్, గౌరవ సలహాదారులు వీరయ్య, జిల్లా కార్యవర్గసభ్యులు వెంకటేష్, చంద్రశేఖర్, మురళి, వెంకటేశ్వర్లు, సునీత, మమత, మండల అధ్యక్షులు రఫిక్, మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

### వెల్ఫేర్‌బోర్డును ప్రభుత్వ ఆధీనంలోనే ఉంచాలి

**కేసముద్రం:** వెల్ఫేర్ బోర్డును ఇతర సంస్థలకు అప్పగించకుండా, ప్రభుత్వ ఆధీనంలోనే ఉంచాలని ఏఐసీటీయూ జిల్లా అధ్యక్షుడు కంచ వెంకన్న డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ఎదుట జరిగిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల ప్రయోజనం కోసం 2009లో బోర్డు ఏర్పాటు చేయడం జరిగిందని, కానీ ఇప్పటి రాష్ట్ర పాలకవర్గం ఇతర సంస్థలకు అప్పగించేందుకు ప్రయత్నిస్తుందన్నారు. ఈ ఆలోచనను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన అన్నారు. దారావత్ రమేష్, గోపన్న, రవి, శంకర్‌నాయక్, ఉపేందర్, శీనన్న, రవి, వెంకటయ్య, సాంబయ్య పాల్గొన్నారు.

### జిల్లాస్థాయి యువజన కళాకారుల ఎంపిక

**మహబూబాబాద్ అర్బన్:** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో ఈ నెల 28న ఉదయం 9గంటలకు జిల్లాస్థాయి యువజన కళాకారుల ఎంపికలు నిర్వహిస్తామని జిల్లా యువజన క్రీడలశాఖ అధికారి అనిల్ మంగళవారం తెలిపారు. జానపద నృత్యం, గ్రూపు, సోలో పాటలు, హిందీ, ఇంగ్లిష్‌లో కవిత్వం, హిందీ, ఇంగ్లిష్‌లో వ్యాసరచన, పెయింటింగ్ వంటి అంశాల్లో పోటీలు ఉంటాయన్నారు. అలాగే ఉపన్యాసంలో హిందీ, ఇంగ్లిష్‌లో మూడు నిమిషాలు మించకుండా మాట్లాడాలన్నారు. హస్తకళలు, వస్త్రాలు, వ్యవసాయ ఉత్పత్తులు, సైన్స్ మేళాలో నూతన ప్రాజెక్ట్‌లను ప్రదర్శించాలన్నారు. జిల్లాస్థాయిలో ఎంపికైన వారిని రాష్ట్రస్థాయికి పంపిస్తామన్నారు. యువజనోత్సవాల్లో పాల్గొనే యువకులు, విద్యార్థులు ఈ నెల 27వ తేదీ సాయంత్రం 4గంటల లోపు 94903 92355, 99852 33882 నంబర్ల వాట్సాప్‌నకు వివరాలు పంపించాలన్నారు.

# చైర్మన్ పదవి ఎవరికో..?

**మానుకోట మార్కెట్ చైర్మన్ పదవిపై నాయకుల నజర్**

- జాబితా తయారీలో తర్జనభర్జన
- పార్టీకోసం పనిచేసిన వారికి అవకాశాలు
- మంత్రి పొంగులేటిదే తుది నిర్ణయం
- వైస్ చైర్మన్ పదవికి మహబూబాబాద్ వాసుల ప్రయత్నాలు





మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

**సాక్షి, మహబూబాబాద్:** నామినేటెడ్ పదవుల పందేరం ఇంకా కొనసాగుతోంది. జిల్లాలో కేసముద్రం, మహబూబాబాద్, తొర్రూరు వ్యవసాయ మార్కెట్లు ఉన్నాయి. ఇందులో గతంలో తొర్రూరు మార్కెట్ కమిటీని ప్రకటించగా.. ఇటీవల క్రితం కేసముద్రం మార్కెట్ కమిటీని వెల్లడించారు. ఇక మిగిలిన మహబూబాబాద్ మార్కెట్ చైర్మన్ ఎవరూ అనేది జిల్లాలో చర్చగా మారింది.

**మారిన రిజర్వేషన్**

మొదటి నుంచి జిల్లాలోని కేసముద్రం మార్కెట్ చైర్మన్‌గా మహబూబాబాద్ నియోజకవర్గానికి చెందిన వారు, వైస్ చైర్మన్‌గా డోర్నకల్ నియోజకవర్గానికి చెందిన వారిని నియమిస్తున్నారు. అదేవిధంగా మానుకోట మార్కెట్‌కు చైర్మన్ డోర్నకల్, వైస్ చైర్మన్ మహబూబాబాద్ నియోజకవర్గాలకు చెందిన వారు, సభ్యులను మార్కెట్ పరిధిలో ఉన్న మండలాల నుంచి ఎంపిక చేస్తున్నారు. అయితే గతంలో కేసముద్రం ఎస్సీ, మనుకోట బీసీ వర్గాలకు రిజర్వుడు అయ్యాయి. ఆయా రిజర్వేషన్ల ప్రకారం చైర్మన్లు, వైస్ చైర్మన్లు, సభ్యులను నియమించారు. వారి పదవీకాలం ముగియడం.. ప్రభుత్వం మారడంతోపాటు రిజర్వేషన్ కూడా మారింది. దీంతో కేసముద్రం జనరల్, మానుకోట ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన వారికి చైర్మన్ అయ్యే అవకాశం దక్కింది. ఇది ప్రకటించినప్పటి నుంచి ఆయా మార్కెట్‌ల పరిధిలోని ఆశావహులు తమ గాడ్ ఫాదర్స్ ద్వారా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగానే కేసముద్రం మార్కెట్ చైర్మన్‌గా మాజీ సర్పంచ్ గంటా సంజీవరెడ్డి నియామకమయ్యారు. తన గాడ్ పాధర్ ద్వారా కాంగ్రెస్‌లో చేరిన ఆయన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపుకోసం శ్రమించారు. అటు పెద్దల ఆశీస్సులు, ఇటు పార్టీకి చేసిన సేవను గుర్తించి సంజీవరెడ్డికి మార్కెట్ చైర్మన్ పదవి కట్టబెట్టారని జిల్లాలో చర్చ.

**తర్జనభర్జన..**

జిల్లాలో మిగిలిన మానుకోట మార్కెట్ కమిటీ చైర్మ న్ పదవికోసం ఆశావహులు ప్రయత్నాలు ముమ్మరం చేస్తుండగా.. ఎవరికి ఇవ్వాలనే ఆలోచనతో ఎమ్మెల్యే రాంచంద్రునాయక్, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు భరత్ చందర్‌రెడ్డి చర్చించుకున్నట్లు తెలిసింది. ఈ సారి ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన వారికి రిజర్వ్ కాగా.. ఆ సామాజిక వర్గానికి చెందిన పలువురు నాయకులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇందులో ప్రధానంగా కురవి, సీరోలు, మరిపెడ, డోర్నకల్ మండలాల నాయకులు ఉన్నారు. ఇందులో చివరకు ఆరుగురి పేర్లు గుర్తించి వారిలో ఒకరికి చైర్మన్ పదవి ఇవ్వాలని నిర్ణయించుకోగా.. మరోసారి ఫిల్టర్ చేసి సీరోలు, కురవి మండలాలకు చెందిన ఇద్దరి పేర్లు ఫైనల్ చేశారు. ఈ ఇద్దరిలో ఒకరి పేరు సూచించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కోరినట్లు తెలిసింది. ఆయన ఎవరి పేరు సూచిస్తే వారే చైర్మన్‌గా నియమితులవుతారు. అదేవిధంగా సంప్రదాయం ప్రకారం వైస్ చైర్మన్ పదవి మానుకోట నియోజకవర్గానికి కేటాయించాల్సి ఉండగా.. అందుకోసం స్థానిక ఎమ్మెల్యే మురళీనాయక్ ద్వారా పేర్లు తీసుకున్నట్లు ప్రచారం. ఒకటి రెండు రోజుల్లో మార్కెట్ పాలక వర్గం ప్రకటన వెల్లడికానుండడంతో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది.

## మానుకోటలోనే ఆర్సీఓ కార్యాలయం



మంత్రి సీతక్క

**మహబూబాబాద్ అర్బన్:** మానుకోట జిల్లాలోనే గిరిజన రీజినల్ కోఆర్డినేటర్ (ఆర్సీఓ) కార్యాలయం కొనసాగుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ,శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ములుగు జిల్లాలో గిరిజన సబ్ రీజినల్ కో ఆర్డినేటర్ కార్యాలయం ఏర్పాటు చేస్తున్నామని, దీంతో ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఆర్సీఓ కార్యాలయాన్ని తరలిస్తున్నట్లు చేస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని మంత్రి సూచించారు. అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాలు, అధికారులను అందుబాటులోకి తీసుకు రావడం కోసం కృషి చేస్తానని అన్నారు.

## నేలమట్టం..



తండధర్మారం ఆకేరు వాగు ఒడ్డున నేల మట్టమైన శ్మశానవాటిక

- ఆకేరు వరదలో కొట్టుకుపోయిన శ్మశానవాటిక
- చివరి మజిలీకి గ్రామస్తులకు తప్పని తిప్పలు

**మరిపెడ రూరల్:** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆకేరు వాగు ఉధృతంగా ప్రవహించి గ్రామాలను ముంచెత్తిన విషయం తెలిసిందే. ఈక్రమంలో మరిపెడ మండలం తండధర్మారం గ్రామ పంచాయతీ శివారు ఆకేరు వాగు ఒడ్డున నిర్మించిన శ్మశాన వాటిక వరద ఉధృతికి నేలమట్టమైంది. గత ప్రభుత్వం హయాంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10 లక్షల వ్యయంతో శ్మశానవాటికను నిర్మించారు. కాగా వరదలకు కనీసం ఆనవాళ్లు లేకుండా పోయింది. చివరి మజిలీకి గ్రామస్తులకు తిప్పలు తప్పడం లేదు. వాగు ఒడ్డున కాకుండా మరోచోట శ్మశానవాటిక నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

## కట్టుదిట్టంగా ఓటరు నమోదు చేపట్టాలి

**మహబూబాబాద్:** ఓటరు నమోదు ప్రక్రియను కట్టుదిట్టంగా చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. వారం రోజులుగా నూతన ఓటరు నమోదుపై చేపడుతున్న ఇంటింటి సర్వే పని తీరు మెరుగుపడిందన్నారు. సర్వేలో ఆధార్ నంబర్‌ను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. నూతన ఓటరు కార్డుల ముద్రణకు అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బూత్‌స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు సమర్పించాలన్నారు. బీఎల్ఓ యాప్ వినియోగంపై బూత్ స్థాయి అధికారులకు శిక్షణ ఇవ్వాలన్నారు. వీసీలో కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీఓలు అలివేలు, నర్సింహారావు, తహసీల్దార్లు భగవాన్‌రెడ్డి, సైదులు పాల్గొన్నారు.

## మైనారిటీ కళాశాల బాలికల ఆందోళన

- ప్రిన్సిపాల్ వేధిస్తున్నారంటూ ఫిర్యాదు



బాలికలను విచారిస్తున్న రీజనల్‌స్థాయి అధికారి

**డోర్నకల్:** మండల కేంద్రంలోని మైనారిటీ గురుకుల బాలికల కళాశాల విద్యార్థినులు మంగళవారం భోజనాన్ని బహిష్కరించి ఆందోళనకు దిగారు. కళాశాల ప్రిన్సిపాల్ రాగసుధ తమను నిత్యం వేధిస్తున్నారని, ఆమెను విధుల నుంచి తొలగించే వరకు తాము భోజనం చేయమని ఉదయం 11గంటల నుంచి కళాశాల ఆవరణలో బైఠాయించారు. కొంతమంది బాలికల తల్లిదండ్రులు సైతం కళాశాలకు చేరుకుని ప్రిన్సిపాల్ వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డిప్యూటీ తహసీల్దార్ వీరన్న, ఆర్ఐ యాసిన్‌తో పాటు పోలీసులు కళాశాలకు చేరుకుని బాలికలను బుజ్జగించే ప్రయత్నం చేయగా వారు పట్టు వీడలేదు. మధ్యాహ్నం 3.30 గంటల తర్వాత వరంగల్ నుంచి రీజినల్ స్థాయి అధికారి రమేష్‌లాల్ హట్కర్ కళాశాలకు చేరుకుని విచారణ చేపట్టారు. బాలికలతో ప్రత్యేకంగా మాట్లాడి వారి వాదనను రికార్డు చేశారు. ప్రిన్సిపాల్ తమను నిత్యం అసభ్యకర పదజాలంతో తిడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని, గతంలోనూ తాము ప్రిన్సిపాల్ వైఖరిపై ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని బాలికలు వాపోయారు. బాలికల తల్లిదండ్రులతో మాట్లాడిన అనంతరం తాము పూర్తిస్థాయిలో విచారణ జరిపి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో బాలికలు భోజనం చేశారు.

# రుణమివ్వండి మహాప్రభో..

- రెండు నెలలుగా బ్యాంకు చుట్టూ తిరుగుతున్న అన్నదాతలు
- డాక్యుమెంట్లు సరిగా లేవని వెనక్కి పంపుతున్న అధికారులు
- మధ్యవర్తి ఉంటే వెంటనే లోన్ మంజూరు



బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు

**మరిపెడ రూరల్:** తెలంగాణ ప్రభుత్వం మూడు విడతల్లో చేపట్టిన రైతు రుణమాఫీ ప్రక్రియ కొనసాగుతోంది. కాగా, రుణమాఫీ అయిన రైతులు నూతన రుణాల కోసం రణం చేయాల్సిన పరిస్థితి మరిపెడ ఎస్‌బీఐలో ఏర్పడింది. రెండు నెలలుగా బ్యాంకు చుట్టూ తిరుగుతున్నా.. రుణాలు ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారు. విసుగెత్తిన రైతులు బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

**బ్యాంకు చుట్టూ ప్రదక్షిణలు**

జూలైలో మొదటి, రెండో విడతలో రుణమాఫీ కాగా రైతులు బ్యాంకు అధికారులను సంప్రదించారు. వారు చెప్పిన ప్రకారం రైతులు వడ్డీ చెల్లించారు. అయితే రుణాలు మాఫీ చేసి కొత్త లోన్లు ఇవ్వాల్సిన అధికారులు ఆదిశగా చర్యలు తీసుకోలేదు. రేపు ఇస్తాం.. మాపు ఇస్తామని చెప్పడంతో రైతులు బ్యాంకు చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఈలోపు ఆగస్టు నెల మొదలు కాగానే ఆడిట్ ఉందని 45 రోజుల పాటు అంటే సెప్టెంబర్ 15వరకు నూతన రుణాల ప్రక్రియను నిలిపివేశారు.

**డాక్యుమెంట్లు సరిగా లేవని..**

ఇన్నిరోజులు నిరీక్షించిన రైతులు మళ్లీ రుణాల కోసం బ్యాంక్‌కు వెళ్తున్నారు. డాక్యుమెంట్లలో ఈసీ లేదని అధికారులు చెబుతున్నారు. దీంతో రైతులు మీ సేవ కేంద్రాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇలా బ్యాంకు అధికారులు రోజుకో సాకు చెబుతూ రైతులను బ్యాంకు చుట్టూ తిప్పించుకుంటున్నారు. విసుగెత్తిన కొందరు రైతులు బ్యాంకు చుట్టూ తిరగలేమని వెనుదిరిగి వెళ్తున్నారు.

**మధ్యవర్తి ఉంటే..**

బ్యాంకులో సుమారు డజన్ మంది మధ్యవర్తులు (బ్రోకర్లు) ఉన్నట్లు తెలుస్తోంది. వీరు కొందరు బ్యాంకు అధికారులతో సంబంధాలు పెట్టుకొని వ్యవహారం నడిపిస్తున్నట్లుగా ఆరోపణలు ఉన్నాయి. మధ్యవర్తులతో రూ.లక్షకు రూ.10వేలు కమీషన్ ఇస్తానని రైతు ఒప్పందం చేసుకుంటే వెంటనే లోన్ మంజూరు అవుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**రెండు నెలలుగా తిరుగుతున్న..**



నాకు మొదటి విడతలో జూలైలో రూ.60 వేల రుణమాఫీ అయింది. అప్పుడు దరఖాస్తు చేసుకుని రెండు నెలలుగా బ్యాంకు చుట్టూ తిరుగుతున్నాను. మధ్యలో ఆడిట్ ఉందని చెప్పారు. ప్రస్తుతం లోన్ కోసం వెళ్తే దరఖాస్తులో ఈసీ లేదని చెబుతున్నారు.

- అంగోతు శంకర్, రైతు, వెంకట్యతండా

**అప్పుతెచ్చి వడ్డీ కట్టాను..**



నా అప్పు రూ.90 వేలు మొదటి దశలోనే మాఫీ అయింది. రుణం కావాలని బ్యాంకుకు వెళ్తే డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు వడ్డీ కట్టాలని చెప్పడంతో అప్పుతెచ్చి చెల్లించాను. కొత్త రుణం ఇస్తారని నెలల తరుబడి బ్యాంకు చుట్టూ తిరుగుతున్నాను.

- వాంకుదోతు మాలు, రైతు, బొత్తలతండా, వీరారం

## విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డీఎంహెచ్ఓ మురళీధర్

**దంతాలపల్లి:** విద్యార్థులకు పౌష్టికాహారం అందించినప్పుడే వ్యాధుల బారినపడకుండా ఆరోగ్యంగా ఉంటారని డీఎంహెచ్ఓ మురళీధర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల, ఎంజేపీ గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని పరిసర ప్రాంతాలను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువుపై దృష్టి కేంద్రీకరిస్తారని తెలిపారు. హాస్టల్ విద్యార్థులు అనారోగ్యం బారినపడకుండా వసతి గృహాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు జ్వరం వస్తే అందుబాటులో ఉన్న ఆస్పత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. హాస్టల్ విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగిన సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి చైతన్య, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఏఎన్ఎంలు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

## రేషనలైజేషన్ జీఓను సవరించాలి



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

**మహబూబాబాద్ అర్బన్:** ఉపాధ్యాయుల సర్దుబాటుకు విద్యాశాఖ జారీ చేసిని జీఓ నంబర్ 25ను సవరించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చుంచు శ్రీశైలం అన్నారు. జిల్లా కేంద్రంలోని కంకరబోర్డు ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం ఉపాధ్యాయుల శిక్షణ కేంద్రంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూతపడిన పాఠశాలలను తెరిపిస్తామని సీఎం ప్రకటన చే శారని, అందుకు విరుద్ధంగా విద్యాశాఖ బడులను మూసి వేస్తుందని ఆరోపించారు. 11 మంది పిల్లలకు ఇద్దరు టీచర్లు, 60 మంది పిల్లలకు ఇద్దరు టీచర్లనే ఉంచడం అసంబద్ధమన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు భిక్షపతి, నాయకులు సువర్ణ, శ్రీనివాస్, సరిరామ్, మంగీలాల్, నరేష్, చంద్రమౌళి, కృష్ణమూర్తి, రవి కుమార్, ప్రకాశ్, అనసూర్య, స్వరూప, మంజుల తదితరులు పాల్గొన్నారు.


**యూటీఎఫ్ ఆధ్వర్యంలో..**

యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపి జీఓ నంబర్ 25ను వెంటనే ఉపసంహరించాలని జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు బి. హరినాయక్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కుమార్, శ్రీనివాస్, షబ్బీర్, వెంకటేశ్వర్లు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఐటీఐలో ప్రవేశాలకు ఆహ్వానం

**మహబూబాబాద్ అర్బన్:** జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో వివిధ ట్రేడ్‌ల్లో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతి రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 28వ తేదీ ఉదయం 11 గంటల లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని, మెరిట్ ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తారన్నారు. అడ్మిషన్ల కోసం ఆసక్తిగల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని సంబంధిత ఐటీఐ కళాశాలకు వెళ్లాలని, ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు మళ్లీ దరఖాస్తు చేసుకొవద్దని, సీట్లు రాని వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలలను సంప్రదించాలన్నారు.

## కలెక్టర్ వసతి గృహాల తనిఖీ



**మహబూబాబాద్ అర్బన్:** జిల్లా కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ బాలుర వసతి గృహాలను మంగళవారం రాత్రి కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని ఆరా తీశారు. ఇష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం వేడివేడి భోజనం వడ్డించాలని వార్డెన్‌కు సూచించారు.

## అనుమతి లేని మందులు విక్రయిస్తే చర్యలు



మాట్లాడుతున్న వ్యవసాయ అధికారులు

**నెల్లికుదురు:** డీలర్లు ప్రభుత్వ అనుమతి లేని పురుగు మందులు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఏడీఏ శ్రీనివాస్ తెలిపారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలంలోని వివిధ గ్రామాల్లోని అగ్రిఇన్‌పుట్ డీలర్లు, ఎరువుల డీలర్లకు మంగళవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ.. దుకాణాల ఎదుట స్టాక్‌బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతిరోజు స్టాక్ రిజిస్టర్లను నమోదు చేయాలన్నారు. ఈ–పాస్ మిషన్ ద్వారానే నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ యాస్మిన్, ఏఈఓలు, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

**అవగాహన**

**కేసముద్రం:** మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో కేసముద్రం, ఇనుగుర్తి మండలాలకు చెందిన ఎరువు, పురుగు మందులు, విత్తనడీలర్లకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ శ్రీనివాస్ మాట్లాడుతూ.. డీలర్లు పీఓఎస్ మిషన్, స్టాక్ రిజిస్టర్, బ్యాలెన్స్, గోదాం బ్యాలెన్స్ సమానంగా ఉండేటట్లు చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ వెంకన్న, ఏఈఓ డి.రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## దళితబంధు ఇప్పిస్తానంటే.. నా గొర్రెలన్ని అమ్మినా..

- చర్చనీయాంశమైన ఫ్లెక్సీ



పెద్దమోరితండాజీపీలో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ

**కేసముద్రం:** దళితబంధు ఇప్పిస్తానంటే నా గొర్రెలన్నీ అమ్మి ఓ మాజీ ప్రజాప్రతినిధికి రూ.70వేలు ఇచ్చా.. కానీ నా గొర్రెలు పాయే.. ఇటు దళితబంధు రాకపాయే.. అంటూ ఓ వ్యక్తి పేరున, నా గొర్రెలు మాకు ఇప్పించండి అనే టైటిల్‌తో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ చర్చనీయాంశమైంది. మండలంలోని పెద్దమోరీతండాలో ఓ వ్యక్తి భారీ ఫ్లెక్సీ ఏర్పాటు చేశాడు. 'దళితబంధు ఇప్పిస్తానంటే నా గొర్రెలన్ని అమ్మి రూ.70వేలు ఇచ్చా, నా గొర్రెలు పాయే, దళితబంధు రాకపోయే, నేను నా కుటుంబం రోడ్డున పడ్డాం. మాకు న్యాయం చేయండి..రెక్కాడితే కాని డొక్కాడని బతుకులు మావి, మా డబ్బులు మాకు ఇప్పించగలరు, లేదంటే మాకు ఆత్మహత్య శరణ్యం, దయచేసి మాకు న్యాయం చేయండి' అంటూ.. అందె అనిల్‌మాదిగ పేరుతో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు.

## డిగ్రీలో ఫెయిలయ్యానని.. విద్యార్థి బలవన్మరణం


దిలీప్ (ఫైల్)

రఘునాథపల్లి: డిగ్రీ పరీక్షలో ఫెయిలయ్యాననే మనస్తాపంతో ఓ విద్యార్థి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం వెల్ది గ్రామానికి చెందిన రాపాక దిలీప్ (22) హనుమకొండలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశాడు. అందులో ఓ సబ్జెక్ట్‌లో ఫెయిల్‌కాగా సప్లిమెంటరీ రాశాడు.పరీక్ష ఫలితాల్లో మళ్లీ ఫెయిల్ కావడంతో జీవితంపై విరక్తి చెందిన దిలీప్ ఈ నెల 22న మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వ్యవసాయ పనులకు వెళ్లిన తల్లి విజయకు ఫోన్‌చేసి తాను పురుగుల మందు తాగినట్లు తెలపగా, భర్త పరుశరాములుతో కలిసి రోదిస్తూ ఇంటికి చేరుకున్నారు. అప్పటికే అపస్మారకస్థితికి చేరుకున్న దిలీప్‌ను జనగామ ఆస్పత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమించడంతో సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.







# పత్తికి ఆపతి..




పత్తి పంటను ఆశించిన పేను బంక, పచ్చ దోమ, తామర పురుగు

### తెల్లబంగారానికి ఆశిస్తున్న రసంపీల్చే పురుగులు

- రైతులకు తీవ్ర నష్టం కలిగే అవకాశం
- సస్యరక్షణ చర్యలు చేపట్టాలి
- మల్యాల కేవీకే సమన్వయకర్త ఎస్.మాలతి, పంట ఉత్పత్తి శాస్త్రవేత్త కె.క్రాంతికుమార్
- అన్నదాతలకు పలు సలహాలు, సూచనలు

మహబూబాబాద్ రూరల్ : పత్తి.. తెల్లబంగారం. రైతుల ఇంట సిరులు కురిపించే పంట. అన్నదాతలకు అధిక లాభాలు అర్జించి పెట్టే ప్రధాన సాగు. అయితే ప్రస్తుతం పత్తి పంటను రసంపీల్చే పురుగులు ఆశించి తీవ్ర నష్టం కలుగజేస్తున్నాయి. ఈ క్రమంలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టి పంటను ఆ పురుగుల బారినుంచి రక్షించుకోవాలి. అప్పుడే పంట చేతికొస్తుంది. లేని పక్షంలో నష్టాల బారిన పడే అవకాశం ఉందని మహబూబాబాద్ మండలంలోని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎస్.మాలతి, పంట ఉత్పత్తి శాస్త్రవేత్త కె.క్రాంతికుమార్ అన్నారు. గత నెల, ఇటీవల కురిసిన వర్షాలకు పత్తిలో చీడపీడల ఉధృతి అధికం కావడం, ప్రధానంగా రసంపీల్చే పురుగుల ఉధృతి పెరుగుతున్నట్లు గమనించామని తెలిపారు. ఈ నేపథ్యంలో పంట రక్షణకు తీసుకోవాల్సిన చర్యల గురించి రైతులకు వివరించారు. ఆ వివరాలు వారి మాటల్లోనే..



డాక్టర్ ఎస్.మాలతి కె.క్రాంతికుమార్

**పేను బంక ..**

పత్తి పంటకు పేను బంక ఆశించినప్పుడు లేత కొమ్మలు, ఆకుల అడుగు భాగాల నుంచి తల్లి, పిల్ల పురుగులు రసం పీల్చడం, ఆకులు దోనెలుగా మారడం, తేనె వంటి జిగురు పదార్థం విసర్జించడం వల్ల మొక్కల ఆకులపై నల్లని బూజు ఏర్పడుతుంది. పేను బంక నివారణకు ఎసిటామిప్రిడ్ 0.2 గ్రాములు లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.25 మిల్లీ లీటర్లు, థయోమిథాక్సాం 0.2 గ్రాములను ఒక లీటర్ నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

**పచ్చ దోమ ..**

పత్తి పంటకు పచ్చ దోమ ఆశించి ఆకుల అడుగు భాగంలో పిల్ల, తల్లి పురుగులు చేరుతాయి. ఆకుల నుంచి రసం పీల్చుతాయి. తద్వారా ఆకుల ఈనెలు దోనెలుగా ముడుచుకుని పసుపు రంగులోకి మారుతాయి. పచ్చ దోమ నివారణకు గాను ఇమిడాక్లోప్రిడ్ లేదా ఫ్లోనికామైడ్ లేదా ఫిప్రోనిల్ 2 మిల్లీ లీటర్లను ఒక లీటర్ నీటికి లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రాములు ఎసిఫేట్ 75 ఎస్.పీ 1.05 గ్రాములను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**తెల్ల దోమ :**

పత్తి పంటను తెల్ల దోమ పింద, కాయ దశలో ఆశిస్తుంది. ఆకుల మీద పచ్చదనం కోల్పోయి మచ్చలు ఏర్పడి, ఆకులు పెరగకుండా ముందే రాలిపోతాయి. పురుగు సోకిన మొక్కలు గిడసబారి పూమొగ్గలు, కాయలు రాలిపోతాయి. తెల్ల దోమ నివారణకు డైఫెన్ థయూరాన్ ఒకటి పాయింట్ 2.05 గ్రాములను లీటర్ నీటికి లేదా స్పైరోమెసిఫిన్ మిల్లీ లీటర్ లేదా థయోమిథాక్సాం 0.2 గ్రాములు లేదా సల్ఫాక్సాఫ్లోర్ 0.75 గ్రాములు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**పిండి నల్లి :**

పత్తి పంటను పిండి నల్లి ఆశించినప్పుడు చిన్న పురుగులు లేత పసుపు రంగులో ఉంటాయి. తల్లి పురుగులు రెక్కలు లేకుండా మైనపు పూత కలిగిన వెంట్రుకలతో కప్పబడి ఉంటాయి. ఈ పురుగులు ఆకు తొడిమల నుంచి పూత, కాయల నుంచి రసం పీల్చడం వల్ల ఆకులపై పసుపు రంగు మచ్చలు ఏర్పడుతాయి. పిండి నల్లి నివారణకు ప్రొఫెనోఫాస్ 50 ఈ.సీ లేదా మిథైల్ పారాథియాన్ 50 ఈ.సీ ఎసిఫేట్ రెండు గ్రాములతోపాటు ట్రిటాన్ లేదా సాండోవిట్ లాంటి జిగురు మందులను ఒక మిల్లీ లీటర్‌ను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**తామర పురుగు**

పత్తి పంటకు తామర పురుగు ఆశించినప్పుడు తల్లి, పిల్ల పురుగులు సన్నగా పసుపు రంగులోకి మారుతాయి. ఆకు అడుగు భాగాన రసం పీల్చడం వల్ల ఆకులు పెలుసుగా మారుతాయి. ఆకుల అడుగున ఈనెల వెంబడి వెండి వలే మెరిసే చారలు కనిపిస్తాయి. తలమాడు తెగులు పత్తిలో తామర పురుగుల వల్ల వ్యాప్తి చెందుతుంది. తామర పురుగు నివారణకుగాను మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీ లీటర్లు లేదా ఎసిఫేట్ 75 ఎస్.పీ లేదా ఫిప్రోనిల్ 2 మిల్లీ లీటర్లను ఒక లీటర్ నీటికి లేదా డైఫెంథయూరాన్ 1.25 గ్రాములు లేదా స్పైనోటోరం 0.9 మిల్లీ లీటర్లను ఒక లీటర్ నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

## నూతన పద్ధతులతో వేస్ట్ వాటర్ ట్రీట్‌మెంట్

- నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధీ


జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న బిద్యాధర్ సుబుధీ

కాజీపేట అర్బన్ : నూతన పద్ధతులు అవలంబిస్తూ ప్రయోగాత్మకంగా వేస్ట్ వాటర్ ట్రీట్‌మెంట్ చేపట్టాలని నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధీ తెలిపారు. నిట్ వరంగల్‌లోని సెమినార్‌హాల్ కాంప్లెక్స్‌లో మంగళవారం నిట్ వరంగల్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ, ఐఐటీ ఖరగ్‌పూర్, కెనడా మెక్‌గిల్ యూనివర్సిటీ సౌజన్యంతో ఏర్పాటు చేసిన 'అడ్వాన్సెస్ ఇన్ బయోలాజికల్ వేస్ట్ వాటర్ ట్రీట్‌మెంట్ అండ్ ఇంటిగ్రేటెడ్ ఆఫ్ అకడమిక్ అండ్ రీసెర్చ్' అనే అంశంపై ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌ను నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. బయోలాజికల్ వ్యర్థాల సేకరణలో మున్సిపాలిటీ పాత్ర కీలకమని, మురుగు నీటిని ఉపయోగకరంగా మార్చేందుకు ఆధునిక టెక్నాలజీని ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కెనడా మెక్‌గిల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ విజయ రాఘవన్, ప్రొఫెసర్లు శిరీశ్ హరి, పి.వి.రావు, సూరజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# భద్రకాళి ఆలయంలో అధికారుల తనిఖీ

- అమ్మవారికి సమర్పించిన నైవేద్యం, ప్రసాదం పరిశీలన
- నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచన


పులిహోర ప్రసాదాన్ని పరిశీలిస్తున్న అధికారులు


ముడిసరుకులను పరిశీలిస్తున్న అధికారులు

హన్మకొండ కల్చరల్ : తిరుమల తిరుపతి దేవస్థానంలో శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యిని ఉపయోగించారనే అంశంపై భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నెయ్యిలో జంతు సంబంధిత కొవ్వు కలిసినట్లు తలెత్తిన ఆరోపణల సెగ నగరంలోని చారిత్రక శ్రీ భద్రకాళి దేవాలయానికి తాకింది. మంగళవారం శ్రీభద్రకాళి ఆలయాన్ని ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేశారు. ఈ మేరకు వరంగల్ జిల్లా ఆహార పరిరక్షణ అధికారి చేపూరి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఆలయ ఈఓ శేషభారతితో కలిసి అధికారులు అమ్మవారికి నిత్యం సమర్పించే నైవేద్యం, ప్రసాదాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రసాదం, నైవేద్యాలు తయారు చేసే వంట గదుల శుభ్రత, లడ్డూ తయారీలో ఉపయోగించే నెయ్యి, ఇతర పదార్థాల గురించి ఈఓను అడిగి తెలుసుకున్నారు. కల్తీపై ఆరాతీశారు. వాటి నాణ్యత పరిశీలించిన అనంతరం శాంపిల్స్‌ను హైదరాబాద్‌లోని రాష్ట్ర ఆహార ప్రయోగశాలకు పంపించారు. భక్తుల విశ్వాసం చూరగొనేలా నాణ్యతకు పెద్ద పీట వేయాలని పలు సూచనలు చేసినట్లు తెలిసింది. ఈ సందర్భంగా ఆలయ ఈఓ శేషభారతి మాట్లాడుతూ అమ్మవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ జరగదని, నిత్యం శుభ్రం , నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నామన్నారు. గత ఫిబ్రవరి (2024)లో భారత ప్రభుత్వ ఆహారపరిరక్షణ ప్రమాణాల అధికారిక సంస్థ ప్రతినిధులు 'ఈట్ రైట్ ప్లేస్ ఆఫ్ వర్‌షిప్' సర్టిఫికెట్‌ను దేవాలయానికి జారీ చేశారని తెలిపారు. ఏపీ ఫెడరేషన్ విజయ కంపెనీ నెయ్యి వాడుతున్నామని, భక్తులకు నాణ్యమైన ప్రసాదాలు అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సూపరిండెంటెంట్ అద్దంకి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

# వినియోగదారులకు శుభవార్త..

- తక్కువ ధరకు నాణ్యమైన విద్యుత్ పొదుపు చేసే ఉపకరణాలు
- ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ ద్వారా విక్రయాలు
- ఈ-కామర్స్ ద్వారా కొనుగోళ్లకు అవకాశం

హన్మకొండ: వినియోగదారులకు శుభవార్త. ఇక నుంచి కరెంట్ బిల్లుల మోత నుంచి ఉపశమనం పొందొచ్చు. విద్యుత్‌ను ఆదా చేసే శక్తి, సమర్థవంతమైన ఉపకరణాలు కొనుగోళ్లకు విద్యుత్ మంత్రిత్వ శాఖ ఈ-కామర్స్ మార్కెటింగ్ సౌకర్యం కల్పించింది. ఈ ఉపకరణాలు తక్కువ ధరకు లభించడంతో పాటు విద్యుత్‌ను పొదుపు చేస్తాయి. వినియోగదారులను విద్యుత్ పొదుపు వైపునకు ప్రోత్సహించడానికి 5 స్టార్ రేటింగ్ కలిగిన ఉపకరణాలను 'ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్' అనే సంస్థ.. ఈ-కామర్స్ మార్కెటింగ్ ద్వారా విక్రయిస్తోంది. ఈ ఉపకరణాల కోసం ప్రత్యేక పోర్టల్‌ను ఏర్పాటు చేసింది. ఈ ఉపకరణాలు వినియోగించడం ద్వారా మూడు సంవత్సరాల్లో వీటి కొనుగోళ్లకు చేసిన పెట్టుబడిని విద్యుత్ పొదుపు రూపంలో పొందొచ్చని ఇంజనీర్లు చెప్పారు. ఎల్ఈడీ బల్బులు, ట్యూబ్ లైట్లు, ఇండక్షన్ స్టౌవ్, 5 స్టార్ బీఎల్‌డీసీ ఫ్యాన్లు, సూపర్ ఎఫిషియెంట్ ఏయిర్ కండీషన్ (ఏసీ)లు, ఎల్ఈడీ ఇన్వర్టర్ బల్బులు ఎనర్జీ ఎఫిషియెంట్ సర్వీసెస్ లిమిటెడ్ పోర్టర్‌లో అందుబాటులో ఉన్నాయి. వినియోగదారులు టీజీ ఎన్పీడీసీఎల్ డాట్ కామ్ వెబ్‌సైట్‌లో లాగిన్ అయి ఈఈఎస్ఎల్ హోమ్ పేజీలోకి వెళ్లి అందుబాటులో ఉన్న ఉపకరణాలు కొనుగోలు చేయొచ్చు. ఆర్డర్ చేసిన వస్తువులు నేరుగా ఇంటికి డెలివరీ అవుతాయి. వినియోగదారులు ఈఈఎస్ఎల్ హోమ్ పేజీలోకి వెళ్లి కావాల్సిన ఉపకరణాన్ని ఎంచుకున్న తర్వాత ఈ-మెయిల్‌తో లాగిన్ కావాలని కోరుతుంది. లాగిన్ కాగానే చిరునామా వివరాలు నమోదు చేయాలి. తర్వాత చెల్లింపులు చేసే విధానం చూపుతుంది. వినియోగదారుడు తనకు అందుబాటులో ఉన్న విధానంలో ఉపకరణానికి సంబంధించిన సొమ్ము చెల్లించగానే బుకింగ్ కార్యక్రమం పూర్తవుతుంది. ఆ తర్వాత నిర్ణీత సమయంలో వినియోగదారుడికి డెలివరీ అవుతుంది. అదే విధంగా ఈఈఎస్ఎల్ పేజీలో క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి కూడా ఆర్డర్ చేసుకునే వెసులుబాటు ఉంది.



ఈఈఎస్ఎల్ పోర్టల్‌లో విద్యుత్ ఉపకరణాలు (లోగో)

### నాణ్యమైన విద్యుత్ ఉపకరణాల కొనుగోళ్లకు ఉత్తమ వేదిక



నాణ్యమైన విద్యుత్ ఉపకరణాల కొనుగోళ్లకు ఈ-కామర్స్ మార్కెటింగ్ ఉత్తమ వేదిక. ఎనర్జీ ఎఫిషియెంట్ సర్వీసెస్ లిమిటెడ్ పోర్టల్‌లో విద్యుత్ పొదుపు చేసే నాణ్యమైన, సమర్థవంతమైన విద్యుత్ ఉపకరణాలు అందుబాటులో ఉన్నాయి. విద్యుత్ పొదుపు చేయడమంటే డబ్బు పొదుపు చేసినట్లే. ఈఈఎస్ఎల్ పోర్టల్‌లో విద్యుత్ ఉపకరణాలు అందుబాటులో ఉన్నాయి. కావాల్సిన వినియోగదారులు సరసమైన ధరలకు కొనుగోలు చేసుకోవచ్చు. మన్నిక కలిగి ఉండడంతో పాటు విద్యుత్ బిల్లు ఆదా అవుతుంది. మరిన్ని ప్రయోజనాలు పొందొచ్చు.

\- కె.వెంకటనారాయణ, ఎన్పీడీసీఎల్ హనుమకొండ ఎస్ఈ

# బెదిరించి.. సీక్రెట్‌గా వీడియో తీశారు

- పోలీసులకు ఫిర్యాదు చేసిన శ్రీనివాస్‌రెడ్డి


మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

జనగామ: జనగామ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిపై చేసిన హత్యాయత్నం ఫిర్యాదుకు సంబంధించి ముగ్గురు నాయకులు జనగామ ఆర్అండ్‌బీ అతిథి గృహంలో తనను బెదిరించి వీడియోలో మాట్లాడించారని అదే పార్టీకి చెందిన నాయకుడు రాహుల శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం సీఐ దామోదర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ పదిహేను రోజుల క్రితం టీపీసీసీ కార్యదర్శి కంచె రాములు, మునిసిపల్, మార్కెట్ మాజీ చైర్మన్లు వేమెళ్ల సత్యనారాయణ, ఎర్రమల్ల సుధాకర్‌లు తనకు ఫోన్ చేసి జనగామకు పిలిపించారన్నారు. చాయ్ తాగేందుకు ఆర్అండ్‌బీ అతిథి గృహానికి తీసుకెళ్లి, డోర్ లాక్ చేసి బెదిరింపులకు దిగారన్నారు. ప్రతాప్‌రెడ్డిపై తాము చెప్పినట్టుగా మాట్లాడాలని ఒత్తిడి చేసినట్లు వివరించారు. లేకుంటే ఇక్కడి నుంచి కదిలే ప్రసక్తే లేదని భయభ్రాంతులకు గురి చేశారన్నారు. కంచె రాములును చంపేందుకు ప్రతాప్‌రెడ్డి తనకు రూ.25లక్షల సుపారీ ఇచ్చినట్లు చెప్పాలని బెదిరింపులకు దిగడంతో ఎలా బయటపడాలనే ఉద్దేశంతో తాను అలా మాట్లాడితే, దానిని సీక్రెట్‌గా వీడియో తీసి, బ్లాక్ మెయిల్ చేస్తున్నారన్నారు. కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తనకు రూ.25లక్షలు సుపారీ ఇచ్చినట్లు పిటిషన్‌లో రాసిన సంగతి తనకు తెలియదని, మీడియాలో వచ్చిన తర్వాత ఖంగుతిన్నట్లు చెప్పారు. ముగ్గురు వ్యక్తులపై తనకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించి, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.

**కాంగ్రెస్‌లో వీడియోల పంచాయతీ..**

జనగామ కాంగ్రెస్‌లో రెండు వర్గాల మధ్య నెలకొన్న వివాదం రచ్చకెక్కుతోంది. టీపీసీసీ కార్యదర్శి హత్యకు ప్లాన్ చేస్తూ.. డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి రూ.25 లక్షల సుపారీ ఆఫర్ చేశారని కంచె రాములుతో కలిసి అదే పార్టీకి చెందిన రాహుల శ్రీనివాస్‌రెడ్డి రెండు రోజుల క్రితం డీసీపీ రాజమహేంద్రనాయక్‌ను కలిసిన విషయం తెలిసిందే. 24 గంటలు గడవక ముందే సదరు నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి యూటర్న్ తీసుకుంటూ సోషల్ మీడియా వేదికగా మంగళవారం ఓ వీడియో రిలీజ్ చేశారు. 'ప్రతాపన్న (ప్రతాప్‌రెడ్డి) తనకు సుపారీ కోసం రూ.25లక్షలు ఆఫర్ చేశారనే వార్తల్లో నిజం లేదు.. ఆయనను రాజకీయంగా అణగదొక్కేందుకు యత్నం చేస్తూ బురద జల్లేందుకు కుట్రలు పన్నుతున్నారని' ప్రస్తావించారు. ఇదిలా ఉండగా డీసీపీకి ఫిర్యాదుకు ముందు మరోవర్గం శ్రీనివాస్‌రెడ్డి మాటలకు సంబంధించి వీడియోలను సోషల్ మీడియలో రిలీజ్ చేసింది. దీంతో రెండు వర్గాల మధ్య వీడియో రిలీజ్‌ల పంచాయతీ రచ్చకు దారి తీస్తోంది.

## తొర్రూరు మాజీ సర్పంచ్‌కు మూడేళ్ల జైలు



తొర్రూరు: గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఓ మహిళతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన తొర్రూరు మాజీ సర్పంచ్ ధరావత్ రాజేశ్‌నాయక్‌కు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ స్థానిక జూనియర్ సివిల్‌కోర్టు జడ్జి మట్ట సరిత మంగళవారం తీర్పునిచ్చారు. ఎస్సై ఉపేందర్ కథనం ప్రకారం.. 2013లో తొర్రూరు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఉన్న రాజేశ్‌నాయక్ పంచాయతీ కార్యాలయంలో ఓ మహిళతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడ్డాడు. విశ్వసనీయ సమాచారం మేరకు అప్పటి ఎస్సై రాయల వెంకటేశ్వర్లు పట్టుకుని కేసు నమోదు చేశారు. సీఐ రాజు విచారణ చేపట్టి చార్జ్‌షీట్ ఫైల్ చేశారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన జడ్జి మట్ట సరిత .. మాజీ సర్పంచ్ రాజేశ్‌కు మూడేళ్ల జైలు, రూ.4 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

## పిడుగుపాటుకు వృద్ధుడి మృతి

కొత్తగూడ: పిడుగు పడి ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం మండలంలోని బత్తులపల్లిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..గ్రామానికి చెందిన దుర్గం లక్ష్మయ్య(65) మొక్కజొన్న చేనుకు కోతుల కాపలాకు వెళ్లాడు. సాయంత్రం ఉరుములు, మెరుపులతో వర్షం వస్తుండడంతో ఇంటికి వెళుతున్న క్రమంలో పిడుగు పడి అక్కడికి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై కుశకుమార్ తెలిపారు.

### రంగయ్యపల్లిలో ఇంటిపై పిడుగు..

- సుమారు రూ. 4లక్షల ఆస్తినష్టం


పిడుగుపాటుకు దగ్ధమైన సామగ్రి

ఎల్కతుర్తి: గాలిదుమారంతో కురిసిన భారీ వర్షానికి ఓ ఇంటిపై పిడుగుపడింది. ఈ ప్రమాదంలో ఇంట్లో సామగ్రితో పాటు నిత్యావసర వస్తువులు, దుస్తులు, నగదు మంటలో పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ఘటన భీమదేవరపల్లి మండలం రంగయ్యపల్లిలో చోటు చేసుకుంది. బాధితురాలి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎర్రబోజు రాధిక ఇంటికి తాళం వేసి తన తల్లిగారి ఊరికి వెళ్లింది. సోమవారం రాత్రి భారీ వర్షంతో పాటు పిడుగు ఇంటిపై పడింది. ఈ ఘటనలో గోడలు పగుళ్లు చూపడంతో పాటు ఇంట్లో ఉన్న సామగ్రి పూర్తిగా మంటల్లో దగ్ధమైంది. సామగ్రితో పాటు కొంత నగదు, బంగారం కాలిందని బాధితురాలు మంగళవారం కన్నీరుమున్నీరైంది. తమను ప్రభుత్వం ఆదుకుని ఆర్థిక సాయం అందజేయాలని వేడుకుంది. కాగా, పిడుగు పడిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది.

# గంజాయి రవాణా ముఠా అరెస్ట్

- 187 కిలోల సరుకు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ తిరుపతిరావు


గూడూరు: పట్టుకున్న గంజాయితో పాటు కారును చూపుతున్న పోలీసులు

గూడూరు: భారీ ఎత్తున ఎండు గంజాయి రవాణా చేస్తున్న ముఠాను గూడూరు పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలోని సర్కిల్ పోలీసు స్టేషన్‌లో సోమవారం సాయంత్రం మచ్చర్ల బస్ స్టేజీ వద్ద నిర్వహించిన వాహనాల తనిఖీలో పట్టుబడిన గంజాయి వివరాలను డీఎస్పీ తిరుపతిరావు మంగళవారం వెల్లడించారు. రెండు కార్లు, 187 కిలోల ఎండు గంజాయితో పాటు, ముగ్గురు వ్యక్తుల అరెస్ట్ చూపారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ యువత తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే దురుద్దేశంతో అక్రమ మార్గాల వైపు దారిమళ్లుతోందన్నారు. ఈ క్రమంలో ఒడిశా నుంచి భద్రాచలం, మహబూబాబాద్, గూడూరు మీదుగా ముగ్గురు వ్యక్తులు రెండు కార్లలో హైదరాబాద్‌కు ఎండు గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారని తెలిపారు. ఆ గంజాయి విలువ సుమారు రూ. 46 లక్షల 76 వేలు ఉంటుందన్నారు. ఒడిశాలోని మల్కాన్‌గిరి జిల్లా పులిమేటలకు చెందిన మండల నరేశ్, ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా కుమ్మరాస్‌కు చెందిన రాహుల్ మజుందార్, రాయ్‌పూర్ జిల్లా అచోచలికి చెందిన హరీశ్‌యాదవ్.. ఒడిశాలోని మల్కాన్‌గిరి జిల్లా పులిమేటలకు చెందిన బాపన్ అనే వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసి రెండు కార్లలో తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. బాపన్ పరారీలో ఉన్నాడని, నలుగురిపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో గూడూరు సీఐ కె. బాబూరావు, ఎస్సై గిరిధర్‌రెడ్డి, కొత్తగూడ ఎస్సై కుశకుమార్, సిబ్బంది బిచ్చానాయక్, కుమారస్వామి, ప్రణీత్, అప్రు, సైదులు, నార్కోటిక్ డీఎస్పీ డి. సురేశ్, సీఐ బి. రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు.

**నలుగురు గంజాయి నిందితుల రిమాండ్**

వర్ధన్నపేట: గంజాయి రవాణా చేస్తూ సోమవారం వర్ధన్నపేట ఆర్టీసీ బస్టాండ్‌లో పట్టుకున్న నలుగురు వ్యక్తులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు వర్ధన్నపేట సీఐ కె. శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బిహార్‌కు చెందిన వివేక్ కుమార్ మిశ్రా, ఢిల్లీకి చెందిన ధర్మేందర్ మలావర్, బాబీదేవి, ద్రౌపదిదేవి, రితీక కలిసి సులభంగా డబ్బులు సంపాదించాలనుకున్నారు. ఇందులో భాగంగా ఏపీలోని విశాఖపట్టణానికి చెందిన రవి నుంచి రూ. 6.85 లక్షల విలువైన 27.41 కేజీల ఎండు గంజాయి తీసుకుని ఢిల్లీకి చెందిన అరవింద్‌కు అప్పగించడానికి ఈ నెల 21వ తేదీన విశాఖ నుంచి హుజూర్ సాహెబ్ నాందేడ్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో ఢిల్లీకి బయలుదేరారు. ఈ నెల 22వ తేదీన ఉదయం కాజీపేట రైల్వే స్టేషన్‌లో సాయంత్రం పోలీసులు బోగీలు తనిఖీ చేస్తున్నారు. గమనించిన వీరు ఇదే రైల్వే స్టేషన్‌లో రైలు దిగారు. అనంతరం రితీక కాజీపేట నుంచి తప్పించుకుంది. మిగతా నలుగురు ఓ లారీలో బయలుదేరి వర్ధన్నపేట ప్రాంతానికి చేరుకున్నారు. రాత్రి నిర్మానుష్య ప్రదేశంలో గడిపి 23 తేదీన సికింద్రాబాద్ వెళ్లడానికి బ్యాగులు తీసుకుని వర్ధన్నపేట ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకున్నారు. అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు తనిఖీ చేయగా ఎండు గంజాయి లభించింది. దీంతో నలుగురిని అదుపులోకి తీసుకుని గంజాయిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామని, పరారీలో ఉన్న రవి, రితిక, అరవింద్ కోసం గాలింపు చేపడుతున్నామని సీఐ కె. శ్రీనివాసరావు తెలిపారు.